జిల్లాలో 16 మంది ఎస్ఐల బదిలీ

జగిత్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 9: జిల్లాలో 16 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. బుగ్గారం ఎస్ఐ సందీప్‌ను కొడిమ్యాల , కొడిమ్యాల ఎస్ఐ వెంకట్రావును ఇటీవలే డీసీఆర్‌బీకి అటాచ్ చేశారు. జగిత్యాల ఎస్‌బీలో విధులు నిర్వహిస్తున్న అరుకల అనిల్‌ను వెల్గటూర్ ఎస్ఐగా, వెల్గటూర్ ఎస్ఐ శ్వేతను కోరుట్ల సెకండ్ ఎస్ఐగా, కోరుట్ల ఎస్ఐ–2 ఇంద్రసేనారెడ్డిని జగిత్యాల ఎస్ఐ 2గా, ధర్మపురి ఎస్ఐ–2 రామకృష్ణను పెగడపెల్లి ఎస్ఐగా, పెగడపెల్లి ఎస్ఐ సతీశ్‌ను గొల్లపల్లికి, కథలాపూర్ ఎస్ఐ కిరణ్‌కుమార్‌ను మల్లాపూర్‌కు, మల్లాపూర్ ఎస్ఐ నవీన్‌కుమార్‌ను కథలాపూర్‌కు, ధర్మపురి ఎస్ఐ దత్తాద్రిని జగిత్యాల టౌన్ ఎస్ఐ–1గా, జగిత్యాల టౌన్ ఎస్ఐ–1 అబ్దుల్ రహీంను మల్యాల ఎస్ఐ–1గా, మల్యాల ఎస్ఐ అశోక్‌ను జగిత్యాల డీఎస్‌బీకి, నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని రెంజల్ ఎస్ఐ ఉదయ్‌కుమార్‌ను ధర్మపురి ఎస్ఐ–1గా, నిర్మల్ జిల్లా మామడ ఎస్ఐ శ్రీకాంత్‌ను జగిత్యాల డీఎస్‌బీకి బదిలీ చేశారు.

పారిశుధ్యాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ యాస్మిన్ బాషా
- కొండగట్టులో ప్రత్యేక పనుల పరిశీలన

కొడిమ్యాల, ఫిబ్రవరి 9: జిల్లాలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా ఆదేశించారు. మండలంలోని పూడూర్ హైస్కూల్, కొండగట్టులో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలకు కలెక్టర్ హాజరై మాట్లాడారు . ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు ప్రతి రోజూ గ్రామాల్లో పర్యటించి పారిశుధ్యం, తాగు నీరు తదితర వాటిని పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో పూడూర్ , కొండగట్టు ప్రత్యేకాధికారులు మణిదీప్, వెంకటేశం, జిల్లా పంచాయతీ అధికారి దేవరాజు, ఎంపీడీవో పద్మ జారాణి, ఎంపీవో ప్రవీణ్, పీహెచ్‌సీ వైద్యురాలు పరమేశ్వరి, సీహెచ్‌వో రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి మనోహర్ ఉన్నారు.

కొడిమ్యాల: పూడూర్‌లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఉపాధ్యాయుల పాత్ర కీలకం

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 9 : సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని కలెక్టర్ యాస్మిన్ బాషా పేర్కొన్నారు. పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని విరూపాక్షి గార్డెన్స్‌లో పీఆర్‌టీయూ జిల్లా శాఖ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్తంగా శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అమర్‌నాథ్ రెడ్డి, ఆనందరావుతో పాటు 33 మంది ఉపాధ్యాయులను కలెక్టర్ అభినందించి సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ అధికార పత్రిక పంచాయతీ రాజ్ ఉపాధ్యాయ సంపాదకవర్గ సభ్యుడు మహేందర్‌రెడ్డి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు కృష్ణ, సిరిసిల్ల శ్రీనివాస్, టీఎస్జీవో అధ్యక్షుడు బోగ శశిధర్, పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకులు జమీల్, రాజు, మహేశ్, చంద్రప్రకాశ్, శ్రీనివాస్‌రెడ్డి, సురేఖ, జమున, జయప్రద, వసంత, చందన, రాధాలక్ష్మి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు రాజశేఖర్, మల్లారెడ్డి, 18 మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

ఓటర్లు.. 9,79,352..

థర్డ్ జెండర్ ఓటర్లు 35 మంది

జగిత్యాల, ఫిబ్రవరి 9: జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో మొత్తం 9,79,352 మంది ఓటర్లు ఉన్నారని కలెక్టర్ యాస్మిన్ బాషా శుక్రవారం తెలిపారు. కోరుట్ల నియోజకవర్గంలో 1,72,026 మంది పురుషులు, 1,77,999 మహిళలు , థర్డ్ జెండర్లు 4, మొత్తం 3,50,013 ఓటర్లున్నారు. జగిత్యాల నియోజకవర్గంలో 1,56,852 మంది పురుషులు, 1,61,554 మంది మహిళలు, థర్డ్ జెండర్లు 25 మంది మొత్తం 3,18,406 ఓటర్లు ఉన్నారు. ధర్మపురి నియోజకవర్గంలో పురుషులు 1,53,194, మహిళలు 1,57,194, థర్డ్ జెండరు ఆరుగురు, మొత్తం 3,10,933 ఓటర్లు ఉన్నారు. మూడు నియోజకవర్గాల్లో 4,82,616 పురుషులు, 4,96,736 మహిళలు, థర్డ్ జెండర్లు 35 మంది ఉండగా మొత్తం 9,79,352 ఓటర్లున్నారు. పురుషులు, మహిళల నిష్పత్తి ప్రకారం 1000 మంది పురుష ఓటర్లకు మహిళలు 1081 మంది ఉన్నారు.

పీవీ నర్సింహారావుకు భారతరత్నపై హర్షం

మల్యాల, ఫిబ్రవరి 9 : మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు కేంద్రప్రభుత్వం భారతరత్న ప్రకటించడంతో బీజేపీ మండలాధ్యక్షుడు శ్రావణ్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన పీవీ ఆర్థిక సంస్కరణలు చేపడ్డడంతో కేంద్ర ప్రభుత్వం భారతరత్న ఇచ్చిందన్నారు.

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 9: జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయ ఆవరణలో జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు నివాళులర్పించారు. పీవీని భారతరత్నకు ఎంపిక చేసిన సందర్భంగా ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, రాజు, దశరథరెడ్డి, శ్రీధర్, సత్యనారాయణ, ప్రశాంత్, సత్తయ్య, తిరుపతి, అనిల్ పాల్గొన్నారు.

మెట్‌పల్లి, ఫిబ్రవరి 9 : మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారత రత్న ప్రకటించడంపై కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు మారుతి బాపూజీ, మెట్‌పల్లి నియోజకవర్గ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కమలాకర్ హర్షం వ్యక్తం చేశారు. సర్పంచ్ నుంచి ప్రధాని దాకా అంచెలంచెలుగా ఎదగడమే కాకుండా ఆర్థిక సంస్కరణలతో భారత దేశం ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దిన మహనీయుడు అని కొనియాడారు.

జీవన్ రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న భీంరెడ్డి తదితరులు

గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి

కట్టుబడి ఉన్నాం

పట్టభద్రులు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల, ఫిబ్రవరి 9 : సమగ్ర ఎన్నారై పాలసీతో కూడిన గల్ఫ్ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు కు ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి స్పష్టం చేశారు. టీపీసీసీ ఎన్నారై సెల్ చైర్మన్ వినోద్‌కుమార్, కన్వీనర్ భీంరెడ్డి, వలస కార్మికుల నాయకురాలు సిస్టర్ లిజీ జోసెఫ్ శుక్రవారం జీవన్ రెడ్డిని ఆయన నివాసంలో కలిసి ఈ బడ్జెట్‌లో గల్ఫ్ సంక్షేమానికి తగిన నిధులు కేటాయించాలని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును కలిసి గల్ఫ్ సంక్షేమం అంశాన్ని వారి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. గల్ఫ్ మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లింపు విషయం ఇదివరకే సీఎం దృష్టికి తీసుకెళ్లానని గుర్తు చేశారు.

తల్లిపై దుష్ప్రచారం చేస్తున్నాడని..

- వెంకటరమణ హత్య కేసును 24 గంటల్లో ఛేదించిన పోలీసులు
- నిందితుడి అరెస్ట్, కత్తి, బైక్ స్వాధీనం

కోరుట్ల, ఫిబ్రవరి 9: పట్టణంలోని అర్బన్ కాలనీలో గురువారం జరిగిన అనుమల్ల వెంకటరమణ (50) హత్య కేసును కేవలం 24 గంటల్లో ఛేదించారు. శుక్రవారం సర్కిల్ కార్యాలయంలో వెంకటరమణ హత్య కేసు వివరాలను కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్ వెల్లడించారు. పట్టణంలోని గాంధీ రోడ్డులో నివాసముంటున్న వెంకటరమణకు, అర్బన్ కాలనీకి చెందిన వాసాల రఘుకు మధ్య పాత కక్షలు ఉన్నాయి. తన తల్లి, కుటుంబ సభ్యులపై వెంకటరమణ తప్పుడు ప్రచారం చేస్తున్నాడని రఘు కక్ష పెంచుకున్నాడు. గతంలో తనపై పోలీస్‌స్టేషన్‌లో కేసులు పెట్టించాడని మనసులో పెట్టుకున్న రఘు గురువారం సాయంత్రం అర్బన్ కాలనీలో బైక్‌పై వెళ్తున్న వెంకటరమణపై కత్తితో దాడి చేసి హత్య చేసినట్లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్లు సీఐ వివరించారు. వెంకటరమణ భార్య పావని ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. శుక్రవారం ఇంటి వద్ద ఉన్న రఘును పట్టుకుని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఇక్కడ కోరుట్ల ఎస్ఐ కిరణ్‌కుమార్, కానిస్టేబుళ్లు ఉన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న సీఐ

ఎగ్జిబిషన్, సర్కస్ నిర్వహణకు టెండర్లు

జగిత్యాల రూరల్, ఫిబ్రవరి 9: జగిత్యాల పట్టణంలోని శ్రీరాజరాజేశ్వర స్వామి దేవాలయ, ధర్మశాలకు సంబంధించిన స్థలంలో సంవత్సరం పాటు ఎగ్జిబిషన్, సర్కస్ నిర్వహణకు శుక్రవారం ఎండోమెంట్ ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్ చంద్రశేఖర్ పర్యవేక్షణలో టెండర్లు నిర్వహించారు. ఏప్రిల్ 1 నుంచి 31 మార్చి 2025 వరకు లీజుకు రూ. 2,20,5000కు గుర్రాల వంశీ కృష్ణ టెండర్ దక్కించుకునట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వేణుగోపాల్, ఈవో విక్రమ్, సిబ్బంది రవీందర్, భార్గవ్, రజినీకాంత్, రఘు, ప్రశాంత్ పాల్గొన్నారు.

రేషన్ కార్డులివ్వాలి

మేడిపల్లి, ఫిబ్రవరి 9: అర్హులైన కుటుంబాలకు రేషన్‌కార్డులు ఇవ్వాలని బీఆర్ఎస్ మైనార్టీ నాయకుడు ఎండీ గాజీపాషా శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ గృహజ్యోతి పథకంలో భాగంగా రేషన్‌కార్డులు ఉన్న కుటుంబాలకు సంబంధించి గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల కరెంట్‌కు ఆన్‌లైన్ చేస్తున్నారన్నారు. రేషన్‌కార్డులు లేని కుటుంబాలకు గృహజ్యోతి పథకం వర్తించదా? అని ప్రశ్నించారు. వెంటనే అర్హులైన కుటుంబాలకు రేషన్‌కార్డులు అందజేసి, గృహజ్యోతి పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

మనోహర్‌కు సన్మానం

మేడిపల్లి, ఫిబ్రవరి 9 : గూండ్లపల్లికి చెందిన గుడ్ల మనోహర్ జిల్లా స్థాయి రన్నింగ్ అథ్లెటిక్స్‌లో మొదటి బహుమతి సాధించగా మాజీ సర్పంచ్ సంపత్‌కుమార్, ఎంపీడీవో వెంకటేశ్ శాలువాతో సన్మానించారు. జడ్పీ ఉపాధ్యక్షుడు హరిచరణ్‌రావు, ఎంపీపీ ఉమాదేవి, రాజార త్నాకర్‌రావు దంపతులు గుడ్ల మనోహర్, పీఈటీ విజయను అభినందించారు. కార్యక్రమంలో నాయకులు భూమారెడ్డి, శ్యామ్ పాల్గొన్నారు.

అధికారుల స్పెషల్ డ్రైవ్

కోరుట్ల, ఫిబ్రవరి 9: పట్టణంలోని మూడో వార్డు సాయిరాంపురా కాలనీలో శుక్రవారం మిషన్ భగీరథ నీటి సరఫరాపై మున్సిపల్ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కౌన్సిలర్ మోర్తాడు లక్ష్మీనారాయణతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ మంచినీటి వినియోగం, బిల్లుల చెల్లింపుపై అవగాహన కల్పించారు. ఇక్కడ మున్సిపల్ ఇంజినీర్ లక్ష్మి, నీటి కులాయి ఇన్‌చార్జి రాజలింగం, లైన్‌మెన్లు ఉన్నారు.

నూతన నియామకం

కోరుట్ల, ఫిబ్రవరి 9: పట్టణానికి చెందిన ఇట్యాల రాజేందర్ కోరుట్ల నియోజకవర్గ ఫిషర్‌మెన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా శుక్రవారం నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా చైర్మన్ తోపారపు రజినీకాంత్, రాష్ట్ర చైర్మన్ సాయికుమార్, కార్యదర్శి నారాయణ, గంగాధర్ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, టీపీసీసీ డెలిగేట్స్ కల్వకుంట్ల సుజిత్‌రావుకు రాజేందర్ కృతజ్ఞతలు తెలిపారు.

కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి

పెగడపల్లి, ఫిబ్రవరి 9: మున్నూరు కాపులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని మున్నూరు కాపు యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆరె దశరథం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆరె మహేందర్ కోరారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మున్నూరుకాపులకు రూ.1000 కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు చిగురు శ్రీనివాస్, జంగిల్ నిఖిల్, అభిషేక్ తదితరులున్నారు.

ఆన్‌లైన్ ప్రక్రియ పరిశీలన

మల్లాపూర్, ఫిబ్రవరి 9: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా సబ్సిడీపై ఎల్పీజీ సిలిండర్ల కోసం దరఖాస్తు చేసిన లబ్ధిదారుల వివరాలను గ్రామాల్లోని సిబ్బంది ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఈ ప్రక్రియను శుక్రవారం ఎంపీడీవో రాజశ్రీనివాస్ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు.

ఐదుగురిపై వరకట్నం కేసు

కొడిమ్యాల, ఫిబ్రవరి 9 : నమిలకొండకు చెందిన మహిళ ఫిర్యాదు మేరకు ఐదుగురిపై వరకట్నం కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ అర్వరాజు శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పల్లెపు లావణ్యకు సిరిసిల్లకు చెందిన కుమార్‌కు కొన్ని సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి మూడు సంవత్సరాల పాప ఉంది. కాగా రెండు సంవత్సరాలుగా అదనంగా రూ.2 లక్షలు కట్నం కావాలని భర్త, అత్తామామ, అడబిడ్డలు వేధిస్తున్నారని లావణ్య ఫిర్యాదు చేసింది. ఈ మేరకు భర్త కుమార్, మామ లక్ష్మణ్, అడబిడ్డలు రేణుక, శారద, స్వప్నపై వరకట్నం కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ వెల్లడించారు.

ముగిసిన సాఫ్ట్ బాల్ శిక్షణ

జగిత్యాల, ఫిబ్రవరి 9 : జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐదు రోజులుగా జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్‌లోని శ్రీ చైతన్య సీబీఎస్ఈ పాఠశాలలో జిల్లా సాఫ్ట్ బాల్ శిక్షణ శిబిరం నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గంగారెడ్డి, డైరెక్టర్ గోవర్ధన్ రెడ్డి, ప్రిన్సిపాల్ పూర్ణచందర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. జిల్లా కార్యదర్శి వెంకటేశ్ మాట్లాడుతూ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు వసతి, భోజనం ఏర్పాటు చేసిన శ్రీ చైతన్య సీబీఎస్ఈ పాఠశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ చెట్పల్లి సుధాకర్, పీడీ గంగాధర్, పీఈటీ ప్రశాంత్, గౌతమ్, ప్రశాంత్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

శిబిరంలో పాల్గొన్న క్రీడాకారులు

అర్హులందరికీ రూ.500కి గ్యాస్ సిలిండర్

పెగడపల్లిలో గ్యాస్ సిలిండర్ పథకం దరఖాస్తులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో

జడ్పీ సీఈవో రఘువరణ్

జిల్లాలో 2.25 లక్షల గ్యాస్ కనెక్షన్లు

పెగడపల్లి, ఫిబ్రవరి 9: అర్హులందరికీ రూ.500కి గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేస్తామని జడ్పీ సీఈవో రఘువరన్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో గ్యాస్ సిలిండర్ పథకానికి సంబంధించి ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో 2.25 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయని, ఇందులో తెల్లరేషన్ కార్డు ఉన్నవారందరికీ ముందుగా పథకాన్ని వర్తింపజేస్తుందన్నారు. అలాగే ప్రభుత్వం చేపడుతున్న ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో చేపట్టాలని, ప్రతి శుక్రవారం డ్రై డే చేపట్టాలని, గ్రామాల్లో ఎక్కడా చెత్త, మురుగు నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం స్థానిక గ్రామ పంచాయతీ, మండల పరిషత్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో పుల్లయ్య, ఎంపీవో మహేందర్, సూపరింటెండెంట్ చక్రధర్‌గౌడ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, సెర్ప్ ఏపీఎం సమత, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, కారోబార్ స్వామి, అంగన్‌వాడీ టీచర్లు, వీవోఏలు పాల్గొన్నారు.

సూపర్ స్పెషాలిటీ దవాఖాన నిర్మించాలి

ఎస్టీయూ తీర్మానం

జగిత్యాల, ఫిబ్రవరి 9 : రాష్ట్రంలో పనిచేస్తున్న ఐదు లక్షల ఉద్యోగ, ఉపాధ్యాయులకు రాష్ట్ర రాజధానిలో ప్రత్యేక సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మించాలని స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎఎస్టీయూ) జిల్లా కార్యవర్గ సమావేశం తీర్మానించింది. శుక్రవారం విద్యానగర్‌లోని ఎస్టీయూ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు మచ్చ శంకర్ అధ్యక్షతన జిల్లా శాఖ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి హరి కిరణ్ పాల్గొని మాట్లాడారు. ఈహెచ్ఎస్ పూర్తిగా ఫెయిల్ అయిందన్నారు. మెడికల్ రీయంబర్స్‌మెంట్ సౌకర్యంలో 20 ఏళ్ల క్రితం మెడికల్ బోర్డు రూపొందించిన ఖర్చుల నిబంధనల పట్టికనే ఇప్పటికీ పరిగణనలోకి తీసుకుంటూ ఉద్యోగికి వైద్య ఖర్చులు చెల్లిస్తున్నారని ఇది ఎంత మాత్రం సరిపోదని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు, పాల్గొన్నారు.

కోరుట్లలో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో రాజేశ్వర్

బైపాస్ రోడ్డు సర్వే అడ్డగింత

కోరుట్ల, ఫిబ్రవరి 9: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నుంచి మంచిర్యాల జిల్లా వరకు నాలుగు వరుసల బైపాస్ రహదారి నిర్మాణానికి అధికారులు సర్వే చేపడుతున్నారు. కోరుట్ల మండలం ఎకీన్‌పూర్, సంగెం గ్రామాల పంట పొలాలు, కోరుట్ల పట్టణ సరిహద్దుల గుండా ఈ రహదారి నిర్మించేందుకు సర్వే పనులు జరుగుతున్నాయి. శుక్రవారం సంగెం రోడ్డులో కోరుట్లకు చెందిన రైతులు సర్వేను అడ్డుకుని నిరసన తెలిపారు. రెండు పంటలు పండే విలువైన భూములను ఇవ్వబోమని, బలవంతంగా తీసుకుంటే ఆత్మహత్యే శరణ్యమని స్పష్టం చేశారు. గతంలో నిర్ణయించిన అలైన్‌మెంట్ ప్రకారం బైపాస్ రోడ్డు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. కోరుట్ల ఆర్డీవో రాజేశ్వర్ చేరుకొని రైతులను సముదాయించారు. అలైన్‌మెంట్ మార్పు చేసి తమ భూములు కాపాడాలని ఆర్డీవోకు రైతులు వినతిపత్రం అందజేశారు. ఇక్కడ రైతులు, తదితరులున్నారు.

శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో జాతర టెండర్లు

సారంగాపూర్, ఫిబ్రవరి 9: బీర్‌పూర్ మండల కేంద్రంలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఈ నెల 19 నుంచి మార్చి 2 వరకు బ్రహ్మోత్సవాలు జరుగనుండడంతో ఎండోమెంట్ అధికారులు గుట్టపైన దుకాణాలను ఏర్పాటు చేసుకునేందుకు శుక్రవారం జాతర టెండర్లను నిర్వహించారు. ఈ బహిరంగ టెండర్లలో కొబ్బరి కాయులు, బెల్లం అమ్ముటకు రూ. 2.16 లక్షలు, గండదీపం నిర్వహణకు రూ. 1.80 లక్షలు, లడ్డూ, పులిహోర అమ్ముకునేందుకు రూ. 3.35 లక్షలు, కొబ్బరి చిప్పల సేకరణకు రూ. 28, 500, పట్టె నామాలు, కోరమీసాలు అమ్ముకునేందుకు రూ. 2.14లక్షలకు టెండర్లు వచ్చినట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. ఇక్కడ ఎంపీపీ రమేశ్, వైస్ ఎంపీపీ లక్ష్మణ్‌రావు, కేడీసీసీబీ జిల్లా డైరెక్టర్ రాంచందర్‌రావు, ఆలయ కార్యనిర్వహణ అధికారి సంకటాల శ్రీనివాస్, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ రవికిషన్, మాజీ ఎంపీపీ రమణ, ఆలయ మాజీ చైర్మన్ రమణారావు, ఉత్సవ కమిటీ సభ్యుడు సామ్రాట్, అర్చకులు, పోలీస్ సిబ్బంది, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం

నృత్యం చేస్తున్న విద్యార్థినులు

మెట్‌పల్లి, ఫిబ్రవరి 9 : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం మనోహర్ గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఇటీవల నిర్వహించిన రెవెన్యూ డివిజన్ స్థాయి టాలెంట్ పోటీల్లో, ప్రీ ఫైనల్ పరీక్షలో, కళలు, సాంస్కృతిక, క్రీడా విభాగాల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు, జ్ఞాపికలను అందజేసి సత్కరించారు. ఇక్కడ ఎన్‌పీడీసీఎల్ మెట్‌పల్లి ఏడీఈ మనోహర్, మండల విద్యాధికారి శ్రీనివాస్, డా. హెప్సిబాకిరణ్, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు, జ్ఞానోదయ కరస్పాండెంట్ ఇల్లెందుల శ్రీనివాస్, పీడీ ఆల్‌రౌండర్ గంగాధర్, జగపతి, ఆనంద్‌రెడ్డి ఉన్నారు.

సరస్వతీ శిశు మందిర్‌లో విద్యార్థులతో క్లబ్ ప్రతినిధులు

విద్యార్థులకు దంత పరీక్షలు

కోరుట్ల, ఫిబ్రవరి 9: పట్టణంలోని లయన్స్ క్లబ్, కోటి నవదుర్గ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో లయన్ ఆడెపు మధు, కమల దంపతుల సహకారంతో వినాయక డెంటల్ కేర్ వైద్యుడు అనురాగ్ సరస్వతీ శిశు మందిర్‌లో విద్యార్థులకు శుక్రవారం దంత పరీక్షలు నిర్వహించారు. 300 మంది విద్యార్థులకు పరీక్షలు చేసి దంత సమస్యలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. అవసరమైన వారికి మందులు, టూత్ బ్రష్‌లు, పేస్ట్, మౌత్‌వాష్ అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు చంద్రమోహన్ – రమ్య, మహేందర్ – ప్రేమలత, కోశాధికారి రాధిక – అనంత కృష్ణప్రసాద్, జోన్ చైర్మన్ అల్లాడి శోభ –ప్రవీణ్, క్లబ్ సీనియర్ నాయకులు డాక్టర్ గండ్ర దిలీప్‌రావు, ఉషా కిరణ్, గుంటుక సురేశ్‌బాబు, ఏలేటి లక్ష్మారెడ్డి, పొలాస రవీందర్ – గీత, రుద్ర సుజాత, పాఠశాల కోశాధికారి నీలి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ గోపు వెంకటేశ్, కొండ బత్తిని అమర్‌నాథ్, ఆడెపు ఆనంద్ పాల్గొన్నారు.

ధర్మపురి అర్వింద్‌కు ఎంపీ టికెట్ ఇవ్వొద్దు

బీజేపీ పార్టీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న జగిత్యాల నాయకులు

- జగిత్యాల బీజేపీ నాయకుల డిమాండ్
- హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయం ఎదుట పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించిన కార్యకర్త

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 9 : నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు ఎంపీ టికెట్ ఇవ్వొద్దని జగిత్యాల బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. 'అర్వింద్ హఠావో.. బీజేపీ బచావో' అని నినదించారు. అంతలోనే కార్యకర్త సతీశ్ ఎవరూ ఊహించని విధంగా ఒంటిపై పెట్రోలు పోసుకొని ఆత్మహత్యకు యత్నించగా, తోటి కార్యకర్తలు వెంటనే తేరుకొని అడ్డుకున్నారు. పక్కనే ఉన్న ఓ షాపు నుంచి బబుల్ క్యాన్లలో తెచ్చి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా అర్వింద్ తీరుపై బీజేపీ నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. ఎంపీగా గెలిచిన ధర్మపురి అర్వింద్ పార్టీ కార్యకర్తలకు అన్యాయం చేస్తున్నాడని ఆగ్రహించారు. 30 ఏండ్లుగా పార్టీ కోసం పనిచేస్తున్న నాయకులను, కార్యకర్తలను పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. పార్టీ కార్యకర్తలను పట్టించుకోని ఆయన, ఎంపీగా ప్రజలను ఏం పట్టించుకుంటాడు అని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఆయనకు నిజామాబాద్ ఎంపీ టికెట్ ఇవ్వొద్దని డిమాండ్ చేశ